*Athaluri Vijayalakshmi was born an brought up in Andhra Pradesh and has the tremendous contributions to the writers world in Telugu. She is very popular for her writings in Radio Shows and Books. Her writing are also taken up to the silver screen for comic movies in Big Telugu movies and small screen plays and stage plays.*





# ప్రతిమాదేవి

# ప్రతిమాదేవి

అత్తలూరి విజయలక్ష్మి

# ప్రతిమాదేవి

గ్రీన్‌సిటీగా పేరుపొందిన బెంగుళూరు... ఎటు చూసినా ఆర్చిలా వంగి చల్లదనాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తున్న కొమ్మలతో ఉన్న పెద్ద, పెద్ద చెట్లు, ప్రతి కాంపౌండ్‌వాల్ మీదా అందమైన రంగుల్లో బోగన్‌విల్లాలు, ఎంతో అందంగా ఉన్నాయి వీధులు. ఆ వీధుల్లోంచి వేగంగా వెళ్తోన్న ఒక టాక్సీ గాంధీనగర్‌లోని ఒక ఇంటి ముందు ఆగింది. అందులోంచి ఒక స్త్రీ దిగి, చేతిలో ఉన్న నల్లని తోలు పర్సులోంచి డబ్బులు తీసి టాక్సీ డ్రైవర్‌చేతికిచ్చింది.. అతనిచ్చిన చిల్లర తీసుకుని లెక్కపెట్టకుండానే పర్సులో వేసుకుని పర్సు జిప్‌లాగి వేసింది.. కొద్దిగా వంగి సీటు మీదున్న సూట్‌కేసు అందుకుంది.. టాక్సీ వెళ్లిపోయింది.. ఆమె దిగినచోటే నిలబడి సూట్‌కేసు ఎడం చేతిలోకి మార్చుకుని, పమిటచెంగు కుడిభుజంమిదకి లాక్కుని ఎడంచేత్తో దాని చివర్లు పట్టుకుని, తడబడే అడుగులతో, గేటుని సమీపించింది.. అప్పుడు సమయం ఉదయం ఏడున్నర .

ఆమె వయసు నలభైఐదు, యాభై మధ్య ఉంటుంది...తెల్లగా, సన్నగా ఉంది... ఉంగరాలు తిరిగిన జుట్టులోంచి కొంచెం ఎక్కువగానే తెల్లని వెంట్రుకలు గాలికి ఎగిరి మొహంమీద పడుతున్నాయి.. మొహంలో నీరసం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నా, ఒకనాటి అద్వితీయ సౌందర్యఛాయలింకా, మొహం నిండా తారట్లాడుతూ, యవ్వనవైభవాన్ని చాటుతున్నాయి. వణుకుతున్న సన్నటివేళ్లతో గేటుతోసి, లోపలికి అడుగుపెట్టింది. ఇంటిముందు ఉన్న కొద్దిపాటి ఖాళీస్థలంలో అనేక రకాల పూలమొక్కలు క్రమబద్ధంగా పెంచిన తీరు ఆ ఇంట్లో ఉన్నవాళ్ల అభిరుచిని తెలియచేస్తున్నాయి.. ఆమె అడుగులో అడుగు వేసుకుంటూ, గుమ్మం దగ్గరకు నడిచింది. గుమ్మానికున్న కర్టెన్ గాలికి కదుల్తోంది. ఆ కదిలిన క్షణంలో లోపలికి తొంగిచూసింది. ముందుగదిలో ఓ సోఫాసెట్టు , రెండు కుర్చీలున్నాయి. అక్కడెవరూలేరు.. లోపలినుంచి వెంకటేశ్వర సుప్రభాతం మంద్రస్థాయిలో వినిపిస్తోంది. ఆ స్వరం విన్న ఆమె గుండెవేగం హెచ్చినట్టు అనిపించింది. చిరపరిచితమైన స్వరం ..దూరమై పాతికేళ్లుకావస్తున్నా ఆ స్వరాన్ని గుర్తించగలదు..

ఆమె కళ్లు ఓసారి గోడకున్న స్విచ్‌బోర్డ్‌వెప్పు తిరిగాయి. కుడిచేయి కొద్దిగా పైకెత్తి కాలింగ్‌బెల్ నొక్కింది..

''ఎవరూ !.వస్తున్నా..'' లోపలినుంచి ఓ అమ్మాయి స్వరం వినిపించింది. కొన్నిక్షణాల్లో ఓ యువతి వచ్చి తెర తొలగించింది... గుమ్మం బైట చేతిలో సూట్‌కేసుతో నిలబడిన స్త్రీని చూసి, '' ఎవరు కావాలండీ?'' అడిగింది..

కంపించే స్వరంతో, సన్నగా వినిపించీ, వినిపించనట్టు అన్నది ఆమె... '' బ....బలరామ్‌గారు...''

ఆ యువతి కాటన్‌చీర కట్టుకుంది.. తెల్లగా ఉంది... నల్లని జుట్టు, లోపల పనిలో ఉందేమో చీర కుచ్చిళ్లు పైకి దోపి ఉన్నాయి..

'' ఉన్నారు... రండి...'' కొద్దిగా పక్కకి జరిగి ఆమెకి లోపలికి దారిచ్చింది... ఆమె లోపలికి నడిచి, సూట్‌కేస్ కింద పెట్టింది...

'' కూర్చోండి..'' ఆ యువతి ఆమెకి కుర్చీ చూపించి లోపలికి వెళ్లింది...

ఆమె కుర్చీలో కూర్చుంది.. లోపలినుంచి ఆ యువతి స్వరం కన్నడలో వినిపించింది..'' నాన్నగారూ! మీకోసం ఎవరో వచ్చారు... పెద్దావిడ...''

వెంటనే గంభీరమైన స్వరం '' కూర్చోమను ''..

ఆమె తన మనసులో చెలరేగుతున్న కలవరం అణచుకుంటూ, చేతుల్తో చీర చెంగు మెలిపెడుతూ, విప్పుతూ అస్థిమితంగా కూర్చుంది.. ఆమెని చూస్తుంటే బాగా అనారోగ్యానికి గురై ఇప్పుడే కొద్దిగా సాంత్వన పొందినట్టుంది.. అయినా మనసులో ఏదో సంఘర్షణ అనుభవిస్తున్నట్టుగా కళ్లు అటూ, ఇటూ కదుల్తున్నాయి.. ఏదో

బాధని అణచుకుంటున్నట్టుగా అనిపిస్తోంది... లోపలినుంచి చేతిలో మంచినీళ్ల గ్లాసుతో వచ్చిన యువతి , ఆమె దగ్గరకు నడిచి అంది.. '' మంచినీళ్లు తీసుకోండి.. నాపేరు అపర్ణ .. బలరాంగారి అమ్మాయిని...''

'' ఓ... అపర్ణా...'' ఆమె పెదాలు అప్రయత్నంగా ఉచ్ఛరించాయాపేరును....'' మీ చెల్లెలి పేరు సావేరి కదూ...''

అపర్ణ సన్నగా నవ్వింది.. '' అవును... కూర్చోండి.. నాన్నగారు పూజలో ఉన్నారు .. వచ్చేస్తారు...'' అంటూ లోపలికెళ్లింది..

అ ..ప .. ర్ణా... ఎంత పెద్దదైంది? తనకన్నా చిన్నది... బలరామ్‌గారికి పెళ్లి అయిన చాలాకాలానికి పుట్టారు ఆడపిల్లలు ఇద్దరు ..పెద్ద పిల్ల అపర్ణ... రెండో పిల్ల సావేరి .. అపర్ణకి పెళ్లి కాలేదా? ఏమో..

ఆమె నిస్త్రాణగా కుర్చీలో వాలిపోయింది.. బాగా అలసిపోయినట్టుగా కళ్లుమూసుకుంది..కళ్లముందు అస్పష్టంగా, మసక, మసకగా ఏవో దృశ్యాలు... కరిగిపోయిన కాలం లోంచి కాలనాగుల్లా పెకివస్తున్న జ్ఞాపకాలనీడలు.. గుండె దడదడలాడసాగింది... బలరామ్‌గారు ఎలా స్పందిస్తారో తనని చూసి...'' ఏమ్మా ఏం సాధించావు?'' అని వెటకారం చేస్తారా? '' ఎందుకొచ్చావు? ఇంకా ఏం నాశనం చేయడానికొచ్చావు?'' అని అవమానిస్తారా... ఏం జరిగినా భరించాలి... చేసిన తప్పుకి శిక్ష అనుభవించాలి.. కోల్పోయిన విలువైన వస్తువుని ఈ చివరిరోజుల్లో ఒక్కసారి, ఒక్కసారి చూడాలి...అవును అందుకోసం ఎవరెంత అవమానించినా తప్పదు...

ఆమె ఆలోచనల్లో ఉండగానే, లోపల్నించి గంట శబ్దం వినిపించింది. వెంటనే హారతిపళ్లెంతో భుజాలకీ, నుదుటికీ విభూదిరాసుకున్న అరవైఏళ్ల వ్యక్తి ముందుగదిలోకి వచ్చి గోడలకున్న దేవుళ్ల పటాలకు హారతిచ్చి, కుర్చీలో కూర్చు న్న ఆమెవెపు చూశాడు.. ఆయన కళ్లు ఆశ్చర్యంతో విశాలంగా అయాయి.. చేతిలో ఉన్న హారతిపళ్లెం కొద్దిగా వణికింది.. కళ్లుతెరిచి ఆయనవెపు చూసిన ఆమె కూడా సంభ్రమంగా లేచి నిలబడబోతూ కొద్దిగా ముందుకు తూలింది.. ఆయన ఎడం చేయి చప్పున ఆమె భుజం పట్టుకుంది. ఆ చేయి ఆసరాతో లేచి నిలబడిన ఆమె అప్రయత్నంగా చేతులు జోడించింది...

'' బాగున్నావా?'' అర్థంలేని ప్రశ్న అనుకుంటూనే అడిగాడాయన..

ఆమె తలవూపింది.

'' ఇప్పుడే వస్తాను'' హారతిపళ్లెం తీసుకుని లోపలికెళ్లిపోయాడు..

ఆయన వెళ్లినవెపై చూస్తున్న ఆమె కళ్లల్లో నీళ్లు నిండాయి... దుఖం అణచుకుంటూ అరచేతిలో మొహం దాచుకుని కుర్చీలో వాలిపోయింది.. పాతికేళ్ల క్రితం నాటి బలరాం కళ్లముందు కదిలాడు..ఎప్పుడూ పంచె, లాల్చీలో నిండుగా, సంప్రదాయసిద్ధంగా ఉండే బలరాం ...కాలం ఎంత వేగంగా ముందుకు పరిగెడుతున్నా, నిర్వికారంగా చూస్తూ, తనదైన ధోరణిలో నింపాదిగా, శాంతంగా వ్యవహరిస్తూ, సంస్కృతీ , సంప్రదాయాలపట్ల అమితమైన గౌరవంతో మెలిగేవాడు... అలాంటి బలరాం గురించి అనేక భయాలతో వచ్చింది... తనకి కావలసినదాన్ని పొందడానికి, చివరిరోజులు ప్రశాంతంగా సాగించడానికి సాయం చేయగల వ్యక్తి బలరాం తప్ప ఇంకెవరూ లేరు.. అందుకే వెతుక్కుంటూ వచ్చింది.. ఆమె మనసులో అప్పటిదాకా చెలరేగిన ఘర్షణ కొద్దిగా తగ్గి మనసు ప్రశాంతత సంతరించుకున్నట్టు అయింది.. చేతుల్లో వణుకు, గుండెల్లోదడ అన్నీ సర్దుకున్నట్టుగా కొంచెం హాయిగా అనిపించింది.. బాగున్నావా అని అడగడంలో ఆత్మీయత ఉన్నా, లేకపోయినా అలా అడగడమే మహాభాగ్యం .. ఎందుకొచ్చావు? అంటాడేమో అనుకుంది... అలా అడగనందుకు సంతోషంగా ఉంది...

ఆమె ఆలోచనల్లో ఉండగానే ఆయన లాల్చీ తొడుక్కుని, భుజం మీద కండువా కప్పుకుని వచ్చారు...'' వస్తూనే, బాగా అలసిపోయినట్టున్నావు.. అలా సోఫాలో కూర్చో, సౌకర్యంగా ఉంటుంది...'' అన్నాడు..

'' ఫర్వాలేదు... మీరు...మీరు ఎలా ఉన్నారు?'' తడబడుతూ అడిగింది..

ఆయన నవ్వాడు....“ చూశావుగా ఇలా ఉన్నాను...ఎప్పటికప్పుడు బాధ్యతల నుంచి విముక్తి పొందాలనుకోడం మళ్లీ ఏవో వచ్చి పడడం ...పెద్దపిల్ల పెళ్లైపోయింది.. హమ్మయ్య అనుకునేలోగా అల్లుడు చనిపోయాడు... తిరిగి నా దగ్గరకి చేరింది... రెండో దాని పెళ్లి చేశాను... ఒరిస్సా వెళ్లింది.. మీ వదిన తన పని ముగించుకుని సెలవు తీసుకుంది..ఇంక నాకు విశ్రాంతి ఒకేసారి “

“ చాలా విషాదం ... ఇలా జరగడం దురదృష్టం..“

“ తప్పదుకదమ్మా.. విధితో రాజీపడాలికదా....“

“ అ...అవును.... “

“ నువ్వెక్కడినుంచి వస్తున్నావు? ఒక్కదానివే వచ్చావా?“

“ హైదరాబాదు వెళ్తొస్తున్నాను...“

“ ఎందుకు? “ ఆయన భృకుటి ముడిపడింది...

ఆమె ఏం మాట్లాడలేదు.. తల వంచుకుంది... కొన్ని సెకెన్ల తరవాత నాలుగు కన్నీటి చుక్కలు ఆమె ఒడిలో ఉన్న అరచేతుల్లో పడ్డాయి...

“ చేసిన తప్పుకి జీవితకాలం వేదన అనుభవిస్తున్నావనుకుంటా...“

ఆమె భుజాలు ఎగిరెగిరిపడుతున్నాయి.. సన్నగా వెక్కిళ్ల శబ్దం వినిపించింది...

ఆయన సన్నగా నిట్టూర్చి అన్నాడు... “ బాధపడకు... కర్తవ్యం ఆలోచించు...“

“ బ...బలరాంగారూ...మీకు తెలుసా...నేను...నేను ఓడిపోయాను.... పూర్తిగా ఓడిపోయాను... “

“ ఓడిపోయావు కాబట్టే నన్ను వెతుక్కుంటూ వచ్చావు .... సర్లె తరవాత మాట్లాడుకుందాం .. కాఫీతాగి, స్నానం చేసి విశ్రాంతి తీసుకో.... నేనలా బైటికి వెళ్తొస్తాను..“ అంటూ “ అపర్ణా!“ అని కొంచెం గట్టిగా కేకేశారు...

అపర్ణ బైటికి వచ్చింది...“ ఏం నాన్నగారూ...“

“ ఈమె నీకు అ క్కయ్య అవుతుంది.... స్నానానికి వేణ్ణీళ్లు పెట్టు... ముందు కొంచెం వేడిగా కాఫీ ఇవ్వు... “

చెంగుతో కళ్లు తుడుచుకుంటోన్న ఆవిడవెప్పు ఆశ్చర్యంగా చూసింది అపర్ణ... “ అక్కయ్యా... ఎలా? ఇంతకాలం నుంచీ లేని అక్కయ్య ఇప్పుడెక్కడినుంచి వచ్చింది.. నాన్నకీ, ఈవిడకీ ఉన్న సంబంధం ఏవిటో...ఆవిడేంటి ఏడుస్తోంది.. కళ్లు ఎర్రగా ఉన్నాయి... కానీ, ఈమెనెక్కడో చూసినట్టుంది... ఈమె?“ ఒక్క క్షణంలో ఆమె మనసులో అనేక సందేహాలు కలిగాయి...

ఆ అమ్మాయి సందేహాలు అర్థం చేసుకున్నవాడిలా అన్నాడాయన... “ వెళ్లమ్మా... కాఫీ తీసుకురా...“

“ అలాగే....“ అపర్ణ లోపలికెళ్లింది..

ఆయన కుర్చీ దగ్గరగా నడిచి ఆమె భుజమ్మీద ఆప్యాయంగా చేయేసి, “ లేమ్మా ప్రతిమా... వెళ్లు లోపలికెళ్లు... “

ఆమె కళ్లు తుడుచుకుని లేచింది... వంగి సూట్‌కేస్ అందుకుని, నెమ్మదిగా లోపలికి నడిచింది...

“ నేనలా వెళ్తొస్తాను.. సాయంకాలం సావకాశంగా మాట్లాడుకుందాం ...“ ఆయన చెప్పులేసుకుని బైటికెళ్లిపోయాడు. వంటచేస్తూ ఆలోచిస్తున్న అపర్ణకి అర్థమైంది ఆవిడ ఎవరో... అప్పుడు గుర్తొచ్చింది...

మంచం మీద విశ్రాంతిగా వాలిన ప్రతిమ కళ్లు మూసుకుంది.. కానీ, కళ్లు మూతలు పడలేదు... గడచిపోయిన కాలంలోని అనేక సంఘటనలు.... గిర, గిరా కళ్లముందు తిరుగుతున్నాయి... వాటినలా కళ్లు విప్పార్చుకుని చూడసాగింది..

ఉఉఉఉఉఉ

వేయి శుభములు కలుగునీకు పోయిరావే మరదలా.... ఏనాటిదో పాట వాయిస్తున్నారు సన్నాయివాయిద్యకారులు... అప్పుడే హైహీల్స్ టక, టకలాడిస్తూ అటుగా పందిట్లోకి వచ్చిన ప్రతిమాదేవి విసుగ్గా అన్నది.. " అబ్బ ఏంటా పాట... వీళ్లకింతకన్నా మంచిపాటలు రావా? "

పందిట్లో కళ్యాణమంటపం బల్ల మీద కూర్చుని పూలు మాల కడుతున్న విశాల కూతురివెప్పు ఆశ్చర్యంగా చూసింది..అప్పుడే విశాల ఆడబడుచు కళ్యాణీ కూడా ప్రతిమవెప్పు చిత్రంగా చూస్తూ ..." అప్పగింతలపాటే అది" అంది..

" అప్పగింతల్లేవు... గాడిదగుడ్డులేదు... ఎప్పుడో ఇక్ష్వాకులకాలంనాటి పాటలు, పద్ధతులు... నేనందుకే చెప్పాను.. బ్యాండ్‌మేళం పెట్టించమని... సన్నాయే సంప్రదాయం అంటూ ఈ కాకిగోల పెట్టించారు.. వాయించింది చాలు ఇంక వాళ్లని వెళ్లమనండి... గిరి మంచి క్యాసెట్లు తెచ్చాడు... ఆ పాటలు పెడతాడు..." అంటూ విశాల చేతిలో ఉన్న మల్లెపూల మాల కట్టినంతవరకూ నోటితో దారం కొరికి తెంపుకుని లోపలికి వెళ్లిపోయింది ప్రతిమ...

" ఏంటి విశాలా దీని ధోరణి.. ఇదంతా అడ్వాన్స్‌మెంటా?" కొంచెం వెటకారంగా అడిగింది కళ్యాణీ...

" దాని తలకాయ... ఈ పాటలో ఉన్న తీయదనం, అర్ధం, ఆర్తి దానికేం తెలుసు... ఎంతసేపటికీ అర్ధంకాని పాప్ మ్యూజిక్ వింటుంది.. సర్లె ఈ కాసిని పూలు నువ్వు కట్టెయ్... నేను లోపలికి వెడతాను..." అంటూ విశాల లేచి లోపలికి నడిచింది...

పందిట్లో పిల్లలంతా గోల, గోలగా అరుస్తూ ఆడుకుంటున్నారు... ఆడవాళ్లు జట్లు, జట్లుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు... కల్యాణ వేదికనిండా పూరేకులు, తలంబ్రాలు తగరం కాగితాలు, రంగు, రంగుల పూసలు పడిఉన్నాయి.. ఉదయాన్నే పెళ్లి జరిగిపోయింది.. ఎనిమిదింటికి మొదలైన ముహూర్తం సప్తపది, స్థాలీపాకం మొదలైన కార్యక్రమాలతో పూర్తి అయి అప్పటికి ఐదు గంటలైంది. ఆరాత్రే అప్పగింతలు..

భోజనాలు అయాక అప్పగింతలు చేయాలి. సాయంత్రం భోజనాలు ఏర్పాట్లు పూర్తయాయి... పెళ్లికూతురు ప్రతిమ ఏరికోరి కొనుక్కున్న పట్టుచీర కట్టుకుని, మరోసారి బ్యూటీషియన్‌తో బ్రైడల్ మేకప్ చేయించుకుంది... ఉదయం పెళ్లికి చేయించుకున్న మేకప్‌కీ, ఈ మేకప్‌కీ చాలా తేడా కనిపిస్తోంది.. ఆ తేడా హెయిర్‌స్టైల్‌దని స్పష్టంగా తెలుస్తోంది..అందమైన ప్రతిమ అలంకరణతో ఇంకా అందంగా ఉందా? లేక కొద్దిగా సహజసౌందర్యం లోపించిందా అర్ధంకావడంలేదు చూసేవాళ్లకి ...అందం సంగతెలా ఉన్నా ఆకర్షణీయంగా ఉండడ మే అందరి దృష్టినీ ఆకట్టుకుంది.. ఈ మేకప్‌లేంటో, ఈ లోకమేంటో ఆధునిక యువతుల పోకడల పట్ల అసహనంగా ఉండే కళ్యాణి మనసులోనే విసుక్కుంటూ మాలకట్టగా మిగిలిన పసిమొగ్గలని ఓ గిన్నెలో ఎత్తి, మడతలు పెట్టిన పూలమాలను, ఆ గిన్నెలను పట్టుకుని లేవబోతుండగా వచ్చారు బలరాం, ఆనంద్...

"ఏంటి అప్పుడే అయిపోయిందా పూలజడవేయడం?" అడిగాడు బలరాం

" ఎవరికి పూలజడ?" విసుగ్గా అడిగింది కళ్యాణి.

" పెళ్లికూతురికే ఇంకెవరికి?"

" చాల్లెండి.. ఆవిడకి పూలజడ వద్దుట..... ఏదో హెయిర్‌స్టైల్ చేయించుకుని మెడమీదకి వేళ్లాడేలాపూలు పెట్టుకుంది.. లోపలికెళ్లి చూడండి.."

" పూలజడ వద్దందా? " ఆశ్చర్యంగా అడిగాడు ఆనంద్...

" నీ కూతురి మోడరన్ పద్ధతులకి పూలజడ మోటుటకదయ్యా మేమేం చేస్తాం .." అంటూ ఆవిడ లోపలికెళ్లిపోయింది..

" సర్లె పూలెతై పెట్టుకుందిగా... మోటు అనకుండా .. పద ఏర్పాట్లు పూర్తయాయో లేదో చూద్దాం .. " ఆనంద్ భుజం మీద చేయేసి లోపలికి నడిపించాడు బలరాం ..

కొద్దిసేపు తరవాత ప్రతిమ తన స్నేహితురాళ్లతో నవ్వుకుంటూ వచ్చి, కుర్చీలు గుండ్రంగా వేయించింది. నలుగురూ ఆ కుర్చీల్లో కూర్చుని కబుర్లు మొదలుపెట్టారు...కాన్వెంట్‌నుంచి, కాలేజీదాకా కలిసే వస్తున్న వాళ్లు వాళ్లంతా...

“ ప్రతిమా... నీ మ్యారేజ్ చాలా గ్రాండ్‌గా చేశారోయ్... రియల్లీ వుయ్ ఎంజాయ్‌డ్ ....“ అన్నది మెరిసే కళ్లతో నిరుపమ.

“ అవును.... చాలా బాగా అయింది ... కానీ, ఇప్పుడు రాబోయే సీన్ తల్చుకుంటే భయం వేస్తుంది ..“ అన్నది సుమ..

“ అవును.... మా అక్క మ్యారేజ్‌లో నేనెతై బాగా ఏడ్చాను....“ హరిత అన్నది ఆ సీను గుర్తుచేసుకుంటూ

“ ఎందుకు ఏడవటం?“ ఆశ్చర్యంగా చూసింది ప్రతిమ...

“ ఎందుకేంటే... ఇది అప్పగింతల సీన్.... మీ మమ్మీ, డాడీ అందరూ ఏడుస్తారు... ఆటోమేటిక్‌గా మనమూ ఏడుస్తాం మనం వాళ్లని విడిచి వెళ్తున్నాం కదా....“

“ నాన్సెన్స్ మ్యారేజ్ అనేది హాపీ అకేషన్. ఏడవడాలూ, శోకాలూ ఐ డోంట్ లైక్... నేను మమ్మీతోచెప్పేస్తాను ఏడవద్దని “ కోపంగా అన్నది ప్రతిమ..

“ ఆ .నువ్వు చెబితే మానతారా? ఆటోమేటిక్‌గా ఏడుపొస్తుంది..“

“ నో.... నేనేడవనివ్వను...“ ప్రతిమ విసురుగా లేచి, లోపలికి వెళ్లింది..

హాల్లో విశాలా, ఆవిడ చెల్లెలు మంజరి న్యూస్‌పేపర్ల మీద పరిచిన లడ్డూలు, సున్నుండలు పెద్ద స్టీలు డబ్బాల్లో సర్దుతున్నారు.. మంజరి అందిస్తోంటే విశాల డబ్బాల్లో సర్దుతోంది.. ఇల్లంతా పెళ్లి హడావుడితో ఉంది బంధువులు కొందరు గదుల్లో కబుర్లు చెప్పుకుంటున్నారు...

మమ్మీ! దూకుడుగా వచ్చిన ప్రతిమవైపు ఆశ్చర్యంగా చూసింది మంజరి.. జుట్టంతా రింగులు, రింగులుగా చుట్టి కొప్పులా చుట్టింది.. కొప్పు మధ్యనుంచి జుట్టుని మూడుభాగాలుగా చేసి మెలికలు తిప్పి చివర్లు పైకి మడిచింది.. ... పెద్ద పూలదండ మూడునామాల్లా పెట్టుకుంది.. ముదురు వంకాయరంగుకి, పసుపుపచ్చ జరీ బోర్డ రు ఉన్న కంచిపట్టుచీర, చీరనిండా జరీపూలు పచ్చటి ప్రతిమ ఒంటిమీద ఆ రంగు ఎంతో బాగుంది. మెడలో పసుపుతాడు కనిపించలేదు.. సూత్రం గొలుసుకి డాలర్స్‌లాగా మంగళసూత్రాలు వేళ్లాడుతున్నాయి.. పెద్ద హారం, దానికి పెద్ద లాకెట్టూ, నల్లపూసల గొలుసు ...చెవులకి జూకాలు, మోచేతులదాకా అందంగా వేయించుకున్న గోరింటాకు, మధ్య, మధ్య బంగారు గాజులతో మోచేతులదాకా ఉన్న ఎర్రని మెరుపుగాజులూ షోకేసులో బొమ్మలా ఉంది ...

మంజరి అనుమానంగా అడిగింది..“ ప్రతిమా! నీ అలంకరణ చూస్తుంటే పెళ్లికూతుర్లా లేవే... ఏదో ఫ్యాషన్ షో కి తయారైనట్టుంది మెడలో పసుపుతాడేది “ ..

“ ఇంకెందుకది? తీసేశాను...“ నిర్లక్ష్యంగా జవాబిచ్చింది ప్రతిమ

అప్పుడు తలెత్తిచూసింది విశాల ..“ తీసేశావా? సూత్రాలు....“

“ ఇవిగో ఈ చైన్‌కి వేసుకున్నాగా...“ సూత్రం గొలుసు కుడిచేత్తో పైకి పట్టుకుని ఊపుతూ అన్నది..

“ నీకేమైనా మతిపోయిందా అప్పుడే తీస్తారా? పదహారు రోజుల పండగైందాకా తీయరు ఎవర్నడిగి తీశావు?“ కోపంగా అడిగింది విశాల..

“ అడిగేదేంటి? నాకలాంటి సెంటిమెంట్స్ లేవు...మూడుముళ్లు గొలుసుతో వేయలేదుకాబట్టి శశితో పసుపుతాడు కట్టించుకున్నా... అలాగని అది మెడలో వేసుకుని తిరుగుతారా అసహ్యంగా..“.

ప్రతిమ మాటలకి నిర్ఘాంతపోయి చూసింది విశాల... ఏదో అనబోతున్న విశాలని వారిస్తూ అన్నది మంజరి

‘‘పోనీలేక్కా దానిష్టం వదిలెయ్... అది పెళ్లికూతురులా లేదు.. మోడల్‌లా ఉంది...‘‘ అంటూ సరదాగా నవ్వింది. ఆమెకి అక్కగారి కోపం తెలుసు ప్రతిమ మొండితనం తెలుసు. ఈ సమయంలో విషయం లాగితే అనవసరంగా రభస అవుతుంది. ఇంటినిండా బంధువులున్నారు బాగుండదు అనుకుని విశాలని మృదువుగా హెచ్చరించింది...

‘‘ అవును మోడల్‌నే‘‘ ..... అంటూ ‘‘ మమ్మీ... నువ్విప్పుడేడుస్తావా? ‘‘ అడిగింది సీరియస్‌గా...

విశాల అసలే కోపంగా ఉందేమో... అర్ధం, పర్ధంలేని ప్రశ్నకి చిరాకుపడుతూ అడిగింది..‘‘ నేనేడవడం ఏంటి? ఎందుకు?‘‘

‘‘ అదే నేనిప్పుడు శశితో వెళ్లేటప్పుడు నువ్వేడుస్తావా?‘‘

‘‘ శశితో నువ్వెళితే నేనెందుకే ఏడవటం? తలతిక్కగా ఉందా నీకు..‘‘

‘‘ మా ఫ్రెండ్స్ అం టున్నారు...ఇప్పుడు అందరూ ఏడుస్తార్ట..‘‘

మంజరి పకపకా నవ్వింది... ‘‘ దాని తలకాయ..అప్పగింతలప్పటిసంగతి మాట్లాడుతోంది.... ‘‘

విశాల అర్ధమైనట్టుగా ఊపిరి పీల్చి అన్నది...‘‘ నువ్విలా సడన్‌గా వచ్చి, అర్ధంలేని ప్రశ్నలేసి కన్‌ఫ్యూజ్ చేయకే... వెళ్లు... వెళ్లి నీక్కావాల్సిన వస్తువులు సూట్‌కేసులో సర్దుకో... మళ్లీ ఏదో ఒకటి మర్చిపోతావు... ‘‘

ప్రతిమ తర్జని చూపిస్తూ అన్నది..‘‘ ఇదిగో ఇప్పుడే చెబ్తున్నా... నేను వెళ్లేటప్పుడు ఎవరన్నా ఏడ్చారంటే బాగుండదు..నాకలాంటి సీన్స్ అంటే ఇష్టం లేదు... మీకాలంలోలాగా అత్తగారింట్లో కష్టాలు పడడానికి మేము వెళ్లడంలేదు... మమ్మల్నెవరూ కష్టాలు పెట్టరు... పెట్టారంటే వాళ్లపని అయినట్టే....‘‘ అంటూ తన గదిలోకి వెళ్లిపోతోన్న ప్రతిమవెప్పు చూస్తూ... ఏంటక్కా దీనిక్కాస్త ‘‘ వేపకాయంత ఉందా?‘‘ అన్నది మంజరి ..

‘‘ వేపకాయేం ఖర్మ... గుమ్మడికాయంత ఉంది....‘‘ అంటూ డబ్బా నిండిపోడంతో మూతపెట్టేసి మరో డబ్బా ముందుకు లాక్కుంది విశాల...

పెళ్లివాళ్లకి భోజనాల ఏర్పాట్లు ఎలా ఉన్నాయో పర్యవేక్షణకి బయలుదేరారు బలరాం, ఆనంద్.. క్యాటరింగ్ వాళ్లు చక, చకా బల్లల మీద డిషెస్ పేరుస్తున్నారు... అన్నిటిమీదా మూతలు తీసి, తాము చెప్పినవన్నీ చేశారో లేదో చూడసాగారు బలరాం , ఆనంద్... పెరుగువడ, పులిహోర, గాజర్‌హల్వా, ఐస్‌క్రీం, మసాలావడలు, బంగాళదుంప వేపుడు, కంద, బచ్చలికూర, సాంబారు, రసం, అప్పడాలు, వడియాలు... ‘‘ బాగుంది.‘‘ .. తృప్తిగా అన్నాడు బలరాం . తిరిగి ఇద్దరూ పందిట్లోకి నడిచారు... పనివాళ్లంతా చిందర, వందరగా ఉన్న కుర్చీలు మళ్లీ ఆర్డర్‌లో పెడుతున్నారు... సన్నాయివాళ్లు అన్నీ సర్దుకుని అలిగి కూర్చున్నారు...

‘‘ ఏంటి వీళ్లింక అవసరం లేదా? ‘‘ అన్నీ సర్దుకున్నారు అడిగాడు ఆనంద్ బలరాంని..

‘‘ నీ కూతురుకి ఈ పాతచింతకాయ పచ్చడి సన్నాయి అంటే ఎలర్జీట... అందుకని వెళ్లిపొమ్మంది..‘‘ నవ్వాడు బలరాం ..

‘‘ పెళ్లికళ వచ్చేది సన్నాయితోటే.... బ్యాండ్‌మేళం నాకిష్టం ఉండదు...‘‘

‘‘ పెళ్లి నీదికాదుగా..... నీ ఇష్టంతో పనేం ఉంది..‘‘

‘‘ నిజమే సుమా .. నేనలా ఆలోచించలేదు... పోనీ ఇప్పుడు పిలుద్దామా?‘‘

‘‘ ఏం అవసరం లెదులే... అంతా అయాక ఇప్పుడెందుకు? ‘‘ బలరాం అనడంతో ఊరుకున్నాడు ఆనంద్...

విశాల, ఆనంద్‌ల ఏకైక కుమార్తె ప్రతిమ...విశాల ఒక జూనియర్ కాలేజీలో లెక్చరర్... ఆమె తెలుగు, సంస్కృతభాషల్లో ఎం ఏ చేసింది... ఆనంద్ అవడానికి సివిల్ ఇంజనీర్ కానీ, ఇంజనీరుగా ఉద్యోగం దొరక్క రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలుపెట్టాడు.. ఆ వ్యాపారం ప్రతిమ పుట్టాక బాగా పుంజుకుని త్వరలోనే స్వంత ఇల్లు, కారు, బ్యాంకు బాలన్స్ సంపాదించగలిగాడు.. నెమ్మదిగా ఎలక్ట్రానిక్ పరికరాల స్పేర్ పార్ట్స్ తయారు చేసే చిన్న

ఫ్యాక్టరీ ప్రారంభించాడు.. మహాలక్ష్మిలా ఇంట్లో అడుగుపెట్టిందని ప్రతిమంటే ఆయనకి అంతులేని ప్రేమ...ఆయన ప్రేమతో ఆమెని అతిగారాబంగా పెంచడం ఒకటి,, స్వతహాగా మొండిది కావడం దాంతో ఆమె ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతోంది.... పసిపిల్లప్పటినుంచే తను అడిగింది చేయకపోతే గట్టిగా కేకలు పెట్టి, ఆ పని సాధించేది..

సున్నితమనస్కురాలు, భావుకురాలు అయిన విశాల కూతురలా మొండిగా కాకూడదని చిన్నప్పటినుంచీ ఆ పిల్లపట్ల కొంచెం క్రమశిక్షణ పాటిస్తుండేది.. అయినా ప్రతిమ మొండిగానే తయారైంది. ప్రతిమను మెడిసన్ చదివించాలనుకుంది విశాల... కానీ, ప్రతిమ మాత్రం ఇంజనీరింగ్ చదువుతానని పట్టుపట్టింది.. ఆమె ఇష్టప్రకారమే ఇంజనీరింగ్‌లో చేర్పించాడు ఆనంద్... అయితే, రెండో సంవత్సరంలోనే తన లెక్చరర్ శశిధర్‌తో ప్రేమలో పడి, మూడో సంవత్సరంతో చదువాపేసి పెళ్లి చేయమని పట్టుపట్టింది.. పిల్లవాడి రూపురేఖలేకాక, నెమ్మదితనం కూడా ఆనంద్‌ని, ముఖ్యంగా విశాలని ఆకర్షించింది. పైగా శశిధర్‌తల్లి సత్యవతి విశాలకొలీగ్... కాబట్టే వాళ్లకి ఈ పెళ్లి పెద్ద అభ్యంతరకరంగా అనిపించలేదు...శశి కూడా ప్రతిమ చదువుపూర్తి చేయాలని అనకపోడం, వెంటనే ముహూర్తాలు పెట్టమనడంతో అనుకోకుండా ముహూర్తాలు నిశ్చయం అయిపోయాయి.. ప్రతిమ ఇరవైఏళ్లు నిండకముందే ఓ ఇంటి ఇల్లాలవడం ఆనంద్‌కి అంతగా నచ్చకపోయినా తప్పలేదు... తన అంతస్తుకి తగ్గట్టు శశి వద్దంటున్నా వినకుండా లక్షరూపాయలు కట్నం ఇచ్చి మరీ పెళ్లి జరిపించాడు...

బలరాం, ఆనంద్‌కి ఇంజనీరింగ్‌లో క్లాస్‌మేట్... అతనిక్కూడా సరైన ఉద్యోగం దొరక్కపోడంతో ఆనంద్ దగ్గరే పావలా పెట్టుబడి పెట్టి పార్టనర్‌గా చేరాడు.. ఆయన భార్య కళ్యాణి... వాళ్లది కన్నడ మాతృభాష ... అయినా తెలుగువాళ్లలాగే ఉంటారు... తెలుగే మాట్లాడతారు.. బలరాం, ఆనంద్ అన్నదమ్ముల్లా ఉంటే, కల్యాణి, విశాల అక్కాచెల్లెళ్లలా ఉంటారు... పక్క, పక్క ఇళ్లే...

ప్రతిమ పెళ్లి చాలా ఆడంబరంగా చేయాలని ఆనంద్, పాత పద్ధతిలో కొబ్బరిమట్టల కళ్యాణమంటపం కట్టి, కేవలం సన్నాయి వాయిద్యం ఆహ్లాదంగా వాయిస్తుంటే సంప్రదాయ పద్ధతిలో భోజనాలు పెట్టాలన్నది విశాల కోరిక... ఆమెకి సంప్రదాయాలంటే చాలా ఇష్టం, గౌరవం ... ఈ ఆధునికత అంతా సనతనాచారాలకు చేసిన పాలిష్ తప్ప, కొత్తగా చేసేదేం లేదని ఆమె వాదన... ఆమె వాదనలో విశ్వాసం ఉన్న ఆనంద్ ఆమెని ఎప్పుడూ కాదనలేడు... అందుకే కొన్ని ఆమె ఇష్ట ప్రకారం, కొన్ని కూతురిష్టప్రకారం, కొన్ని తనిష్టప్రకారం పద్ధతులు పాటిస్తూ, ముగ్గురికీ సంతృప్తి కలిగించే ప్రయత్నం చేశాడు.. కాకపోతే ప్రతిమ మాత్రం అసలు రిజిస్టర్ మ్యారేజీ చేసుకుంటానని, గ్రాండ్‌గా ఫైవ్‌స్టార్ హోటల్లో పార్టీ ఇస్తానని గొడవ.. అందుకు శశిగాని, అతని తల్లి తండ్రులుకానీ ఒప్పుకోకపోడంతో సంప్రదాయ పద్ధతి ప్రకారం పెళ్లిచేసుకోడానికి ఒప్పుకుంది. అది కూడా చాదస్తంగా చేస్తున్నారని విసుక్కుంటూ గౌరీపూజకి ముందే బ్రేక్‌ఫాస్ట్ చేసి, ముహూర్తం టైం దాటిపోయినా మేకప్ చేసుకుంటూ, స్నేహితురాళ్లతో కబుర్లు చెపుతూ కూర్చోడం, పెళ్లి తంతు చూసి ఇంతసేపా, ఇంతసేపా అంటూ విసుక్కోడం పెద్దవాళ్ల మనసులో అసంతృప్తిని రేకెత్తించింది.. అయినా ఆమె మొండితనం తెలిసిన వాళ్లు ఆ విషయాలు పెద్దగా పట్టించుకోలేదు..విశాలకి మాత్రం కూతురు అడుగడుగునా మొండితనం చేస్తోంటే కోపంకన్నా ఆందోళన కలుగుతోంది... ఈ మొండితనం అత్తగారింట్లో ఎంతవరకు సాగుతుంది అనేది ఆమె భయం ..అయితే, ఆమె ఆందోళన గమనించిన పవిత్ర మృదువుగా నవ్వుతూ ఏం ఫర్వాలేదు అన్న అభయం ఇస్తోంటే కొద్దిగా ఊరట చెందుతోంది...ఆవిడ మాత్రం తనకి తెలిసినంతమటుకు అన్నీ పద్ధతిప్రకారం చేస్తూ పెళ్లివాళ్లని సంతృప్తి పరచడానికి ప్రయత్నిస్తోంది..

ఆనంద్ సన్నాయివాళ్లకి డబ్బులిచ్చి పంపించేశాడు..... మైకులో అర్థంలేని సినిమాపాటలు హోరు పెడుతున్నాయి.. విశాల చిరాకుపడుతూ వచ్చింది. ఆనంద్ దగ్గరకు వెళ్లి ‘‘ ముందా దిక్కుమాలిన పాటలు ఆపుచేయించండి ‘‘ అన్నది..

“ అమ్మాయి పెట్టుకుంది... ఆపేస్తే గొడవ చేస్తుంది“ అన్నాడు ఆనంద్...

“ అప్పగింతలకు ముహూర్తం వేళైంది.. పాటలు అవసరంలేదు..“ అంటూ తనే వెళ్లి టేప్ రికార్డర్ ఆపుచేసి వచ్చింది.. పెళ్లివారు విడిదినుంచి భోజనాలకు రావడంతో అప్పటికా ప్రస్తావన ఆగిపోయింది.. ఆడపెళ్లివారి హడావుడి మొదలైంది..

విశాల కోరికమీద సరదాగా కొన్ని ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు జరిగాయి. వాటిలో ఆడపిల్లలు పెళ్లికొడుకుని ఏడిపిస్తూ పాటలు పాడడం, డ్యాన్సులు చేయడం, కొందరు అంత్యాక్షరి ఆడడం ... పెళ్లికొడుకు, పెళ్లికూతురిచేత ఎంగిలి లడ్డు తినిపించడం ... అవన్నీ ఎంజాయ్ చేసింది ప్రతిమ.. విశాల కనుచూపుతో ఆగిపోయిందికానీ, ఆ పిల్లలతోపాటు తనూ డ్యాన్స్ చేయాలన్న ఉబలాటం కలిగిందామెకి.. ఆ తరవాత అప్పగింతలు, చాలా మామూలుగా జరిగిపోయింది.. దంపత తాంబూలాలు, సారె ఇవ్వడం అన్నీ శాస్త్రబద్ధంగా చేయించింది విశాల...“ ఏవిటీ హడావుడి విశాలా మనలో మనకివన్నీ ఎందుకు? “ అంటూ సత్యవతి అభ్యంతరపెట్టినా...“ ఇవన్నీ ఎందుకు పెట్టారో మన పెద్దవాళ్లు... వాటిని అనుసరించడంలో మనకే ఇబ్బందీ లేనప్పుడు అనుసరిస్తే తప్పేం ఉంది... పెళ్లి చేసుకోడం అనేది జీవితంలో ఒక్కసారే అని పిల్లలు ఎంజయ్ చేయాలనుకున్నట్టు, నేనూ పెళ్లిచేయడం ఒక్కసారేగా , అందుకే ఈ పద్ధతులు పాటిస్తూ ఎంజాయ్ చేయాలనుంది..“ అన్నది..

పాలల్లో చేతులు ముంచి కూతుర్ని అప్పగిస్తున్నప్పుడు విశాలకి దుఃఖం పొంగుకొచ్చింది... కూతురు వెళ్లేది బాగా తెలిసిన వాళ్లింటికే అయినా, సత్యవతి సంస్కారం మీద, పెళ్లికొడుకు మీద ఎంత నమ్మకం ఉన్నా, కూతుర్ని పరాయివాళ్లకి అప్పగిస్తోంటే ఇంక నుంచీ ఈ అమ్మాయి మీద నాకేం హక్కులేదా... ఇంక ఈ ప్రతిమ తన కూతురుకాదా.... ఇంకనంచీ తనతో దెబ్బలాడడాలు, చీటికీ, మాటికీ అలకలు, మంకుపట్టు పట్టడాలు... ఇంట్లో అల్లరిచేయడాలు ఇవేం ఉండవా? రేపట్నించీ ఈ ఇంటికి ప్రతిమ పరాయిదా? ఇలా అనేక భావాలు ఆమె మనసులో చెలరేగి, గుండెని కెలుకుతున్నట్టు అనిపించింది.. ఈ ప్రతిమ మీద ఇంక తనకేం హక్కులేదు అని తల్చుకుంటే మనసంతా వేదనతో నిండిపోయింది... తను ఏడిస్తే ప్రతిమ కూడా ఎక్కడ ఏడుస్తుందో అని దుఃఖాన్ని దిగమింగి చిరునవ్వుతో కార్యక్రమం పూర్తి కానిచ్చింది.. వెళ్లేటప్పుడు ప్రతిమ ఏడిస్తే ఎలా ఓదార్చాలా అని మనసులోనే రిహార్సల్స్ చేసుకుంది..

అప్పుడావిడకి ప్రతిమ ఎవరూ ఏడవడానికి వీల్లేదు అని వార్నింగ్ ఇచ్చిన సంగతి గుర్తురాలేదు... ఆవిషయం చాలా క్యాజువల్‌గా ప్రతిమ వాగే పిచ్చివాగుడుగా భావించింది... అప్పగింతలప్పుడు ఏడవాలా? వద్దా అని ఆవిడ ఆలోచించి నిర్ణయించుకోలేదు... ఎవరూ కూడా అలా ఆలోచించరు... ఆడపిల్ల జీవితంలో జరిగే అతి ముఖ్యమైన సంఘటన పెళ్లి... అప్పగింతలు... అప్పగింతలనేది ప్రతివారి గుండెలనూ తడిచేసే సంఘటన... ఆ సందర్భంలో ఏడవడానికి కానీ, ఏడవకుండా ఉండడానిక్కానీ, ప్రత్యేకమైన రిహార్సల్స్ ఎవరూ చేయరు... అలాగే అప్పటిదాకా ఆ విషయం ఆలోచించని విశాలకి ఇప్పుడు కూతుర్ని అప్పగిస్తోంటే గుండెతెగేలా దుఃఖం వస్తోంది...తను ఏడిస్తే ప్రతిమ కూడా ఏడుస్తుందని, ఆ పిల్లని ఓదార్చే శక్తి తనకి లేదని, తన దుఃఖాన్ని గుండెల్లోనే అణిచేయడానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

‘‘ సత్యా... ఇకనుంచీ ప్రతిమ నీ కూతురు‘‘ అన్నది బొంగురుపోయిన స్వరంతో...

సత్యవతి ఆదరంగా చూసింది...

ప్రతిమ విసుగ్గా అన్నది ‘‘ మమ్మీ.... ఏడవద్దని చెప్పానా..... ‘‘

విశాల విస్తుబోయింది... గారంగా పెరిగిన పుట్టింటినుంచి , అత్తగారింటికి వెళ్తోన్న పిల్లేనా ఇది... ఇలా కూడా ఉంటారా ఆడపిల్లలు...

‘‘ సత్యవతీ.... ముహూర్తం టైం అయింది....కారు రెడీగా ఉంది....‘‘ సత్యవతి భర్త సుందరం వచ్చాడు...

విశాల తన భావాలను తనలోనే అణిచేసుకుని ‘‘ అన్నీ రెడీగా ఉన్నాయి.. కారులో సర్దిస్తాను‘‘ అన్నది.

ప్రతిమ సూట్‌కేసు, బ్యాగు, సారెకి సంబంధించిన పెళ్లివారి సూట్‌కేసు, మిఠాయిఉండలు, సున్నుండలు, జంతికల డబ్బాలు అన్నీ కార్లలో సర్దేశారు... పెళ్లికొడుకు శశిధర్, ఆనంద్ విశాల ల దగ్గరా, బలరాం, కల్యాణి దగ్గరా మిగతా బంధువులు, స్నేహితులదగ్గర సెలవు తీసుకున్నాడు...

‘‘ జాగ్రత్త బాబూ... ప్రతిమ కొంచెం మొండిది... కానీ, ఎంత మొండిదో అంత సెన్సిటివ్ కూడా...‘‘ అన్నది విశాల కూతురిచ్చిన వార్నింగ్ మరిచిపోయి మరోసారి కన్నీళ్లతో..

‘‘ డోంట్ వర్రీ ఆంటీ... ఇప్పటినుంచి ప్రతిమ నాది కదా.... మీరేం బాధపడకండి నేను చూసుకుంటాగా ‘అన్నాడు శశి చిరునవ్వుతో...

‘‘ జాగ్రత్త నాన్నా ప్రీతూ... ఇక్కడ చేసినట్టు అక్కడ మంకుతనం చేయకు...‘‘ కూతురితో అన్నది ..

‘‘ మమ్మీ... ఆ ఇల్లు, ఆ మనుషులు నాకు కొత్తైనట్టు చెప్తావేంటి? నా గురించి నువ్వేం వర్రీ అవకు....‘‘ ప్రతిమ నిర్లక్ష్యంగా జవాబు చెప్పడంతో నిరుత్తరురాలైంది..వెళ్లేటప్పుడు తల్లి, తండ్రులను విడిచి వెళ్లడానికి మారాం చేస్తుందని, బావురుమని ఏడుస్తుందని అనుకున్న విశాల మనసు కొంచెం చివుక్కుమంది..

ఇదేంటీ పిల్ల? ఇది కూడా ఆధునికతలో భాగమా? ప్రతిమ చాలా డైనమిక్, బోల్డ్ అని అందరూ అంటోంటే కావచ్చు అనుకుంది కానీ, పెళ్లి చేసుకుని, దాదాపు శాశ్వతంగా పుట్టింటితో సంబంధం తెంచుకుని వెళ్లిపోతూ కూడా ఆమె కళ్లు చెమర్చలేదంటే ఏమని అర్థం చేసుకోవాలి? ఎందుకో విశాలకి ప్రతిమ అలా ఉండడం నచ్చలేదు...అత్తగారింటికి వెళుతోన్న ఆడపిల్లకి తల్లిగా తనే కొన్ని విషయాలు చెప్పడం బాధ్యత ..

కానీ, ప్రతిమ ఏ దిగులూ, భయమూ లేనిదానిలా శశి తో సర్వం మైమరచి కబుర్లు చెపుతోంటే నివ్వెరపోయింది...ఇలాంటి పిల్లకి తను చెప్పే మాటలు రుచిస్తాయా... ‘‘ అబ్బా ఏంటి మమ్మీ నీ సూక్తులు... నేనేం నీ స్టూడెంట్‌నా? నాకు పాఠాలు చెప్తావు‘‘ అని తిరిగి తననే అంటే ఏం సమాధానం చెప్పగలదు.. అలా అనుకున్నాక, ఆమె మనసులో దుఃఖం స్థానంలో ఏదో తెలియని నిర్లిప్తత చోటు చేసుకుంది.. ప్రేమించినవాడు...జీవితాంతం కలిసి బతకాల్సినవాడు అతనికన్నా తనెక్కువ కాదులే అనిపించింది..

అయినా ఏదో ఒకటి చెప్పడం తన ధర్మంగా భావించిన విశాల తను చెప్పదల్చుకున్న మాటలు సత్యవతితో చెప్పింది.. ‘‘ ప్రతిమది చిన్నపిల్ల మనస్తత్వం సత్యా... నీ మనసుకేదన్నా కష్టం కలిగించే పని అది చేస్తే ముందుగా నాతో చెప్పు...‘‘ అంటూ దీనంగా తన చేయి పట్టుకున్న విశాలను ఓదార్చింది సత్యవతి....‘‘ మనం చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నవాళ్లం విశాలా.... కథల్లో లాగా అత్తగారనగానే ఆరళ్లు పెట్టేది అనే భావన ముందు పోగొట్టుకోవాలి.. నీకెందుకు ప్రతిమను నా కన్న కుతురికన్నా ఎక్కువగా చూసుకుంటాను...‘‘ అన్నది మాటిస్తూ...

ఆవిడ మాటలకి విశాల మనసు కొద్దిగా ఊరట చెందింది..అందరూ అందరి దగ్గరా సెలవు తీసుకున్నాక పెళ్లివారి కార్లు నాలుగు ఒక్కసారే కదిలాయి.. ప్రతిమ కార్లో కూర్చోబోతూ మాత్రమే ‘‘ బైమమ్మీ .. బైడాడీ, బైబై అంకుల్ ‘‘ అంటూ చెప్తోంటే కాలేజికి వెళ్లబోయే ముందు రోజూ చెప్పే బైలాగే ఉంది కాని, పెళ్లి చేసుకుని,

అత్తారింటికి శాశ్వతంగా వెళ్లిపోతున్న ఓ ఆడపిల్ల ఆవేదనతో కూడుకున్న సెలవులా అనిపించలేదు... కార్లు వెళ్లినవెప్పు నిర్వికారంగా చూ స్తూ ఉండిపోయారు విశాలా ఆనంద్...

సర్వశక్తులూ హరించిపోయినట్టుగా అవడంతో నీరసంగా నడిచి, అక్కడె ఉన్న ఓ కుర్చీలో కూలబడింది..అప్పటిదాకా ఆపుకున్న దుఖం ఒక్కసారిగా ఉప్పెనలా పొంగింది.. రెండుచేతుల్లో మొహం దాచుకుని వెక్కి, వెక్కి ఏడవడం మొదలుపెట్టింది.. ఆవిడ వెనకాలే వచ్చిన కల్యాణి, ఆనంద్ విశాల అలా ఏడుస్తుండడంతో ఖంగారుపడ్డారు... కల్యాణి ఆమె దగ్గరగా నడిచి భుజంమీద చేయేసి, " విశాలా.... ఏంటి ఏమైంది. ఇప్పటిదాకా ధైర్యంగానే ఉన్నావుగా... ఛ, ఛ ఏడవకు... లే... ఎక్కడికెళ్లింది నీ కూతురు.. ఏం ఊరొదిలి వెళ్లిందా? దేశం వదిలివెళ్లిందా? పెగైా వాళ్లు నీకు బాగా తెలిసినమనుషులు... ఇంక భయం దేనికి? లే, లే...తప్పు.... శుభకార్యం జరిగిన ఇంట్లో ఇట్లా ఏడవకూడదు..." అంటూ ధైర్యం చెప్పసాగింది..

ఆనంద్ కూడా ఆమె పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని గద్గదస్వరంతో అన్నాడు..." బాధపడకు విశాలా... పాప సంతోషంగా వెళ్లింది .మనకెందుకు దిగులు?.. తను కోరుకున్న ఇంటికి వెళ్లింది.. అంతకన్నా మనకేం కావాలి? " నిజానికి ప్రతిమ ప్రవర్తన అతని మనసుని కూడా గాయం చేసింది.. చిన్నప్పటినుంచీ కోరింది కాదనకుండా ఇస్తూ, ఎంతో గారంగా, ప్రేమగా పెంచుకున్న కూతురు , పెళ్లి చేసుకుని, కాపురానికి వెళుతూ తల్లి, తండ్రులతో తన ఎమోషన్స్ పంచుకోకపోవడం, మెటీరియలిస్ట్‌గా ఉండడం ఆయనకి బాధనేకాక, ఆశ్చర్యాన్ని కూడా కలిగించింది.. ప్రతిమ ఆధునిక యువతి.... చాలా అభ్యుదయభావాలున్న అమ్మాయి... స్వేఛ్ఛగా స్వతంత్రంగా పెరిగిన పిల్ల .. ధైర్యస్తురాలు... మొండిది... నిజమే... కానీ, అన్నిటికన్నా మించింది ప్రతిమకూడా ఆడపిల్ల... ఆడపిల్లకి సహజంగా ఉండే సిగ్గు, తల్లితండ్రులపట్ల ప్రేమా, పుట్టింటిమీద మమకారం, బంధువులపట్ల ఉండాల్సిన అభిమానం ఇవేవీ ప్రతిమలో కనిపించలేదు ఆయనకి... ఇంతకాలం ఆయన అవేం గమనించలేదు... కూతురు డాడీ నాకు కొండమీద కోతికావాలి తెచ్చివ్వండి అంటే అలాగే తల్లీ అంటూ నౌకర్లని పురమాయించి ఆ కోతిని తెచ్చివ్వడమే తప్ప, ఎందుకమ్మా ఆ కోతి.... వేరే బొమ్మ తెప్పిస్తాలే అనే ధైర్యంకానీ, అలా అనాలన్న ఆలోచనగానీ లేని వ్యక్తి.... కూతుర్ని ప్రేమించడమే తప్ప, ఆ ప్రేమకి కొన్ని పరిమితులుంటాయని, అవి పాటించకపోతే, పిల్లలు క్రమశిక్షణ తప్పుతారన్న ధ్యాసలేని అమాయకుడు...

ఆనంద్‌కి డబ్బులు సంపాదించడం తప్ప, వేరే విషయాలు తెలియవు... ఆయనలో కపటం లేదు.. లౌక్యం తెలియని మనిషి.. చిన్ననాటి స్నేహితుడు బలరాం లేకపోయి ఉంటే ఆనంద్ వ్యాపారంలో ఎప్పుడో నష్టపోయేవాడు.. ఆయన్ని నమ్మించి మోసం చేసే అవకాశాలు ఆయనచుట్టూ ఉన్నవాళ్లకి అనేకం ఉన్నాయి.. కానీ, ఆ అవకాశాలు ఎవరూ ఉపయోగించకుండా అనుక్షణం రక్షణకవచంలా ఆయన్ని కాపాడుతున్నాడు బలరాం .. ఈ సంగతి విశాలకి తెలుసు... ఆనంద్ అంటే ఆవిడకి ఎంత ప్రేమో... అంత జాలి. అలాగే కొన్ని విషయాల్లో చాలా కోపం కూడా... అయినా ఆయన్ని ఆమె ఏమీ అనదు... ఆయన ధోరణి మార్చడానికి ఆమె ఎప్పుడూ ప్రయత్నించలేదు... హటాత్తుగా ఆయనకి తెలియని విషయాలు చెప్పి, ఆయన మనసు కలుషితం చేయడం ఆవిడకిష్టం లేదు.. అందుకే ఆయన బాధ్యత బలరాం మీద పెట్టి, తను నిశ్చింతగా ఉంటోంది..

ఆనంద్‌కి ఈ రోజున... అదికూడా జీవితంలో అత్యంత ముఖ్యమైన రోజున కూతురి ప్రవర్తన ఏ మాత్రం జీర్ణం కావడంలేదు... ప్రతిమకి తల్లి తండ్రుల పట్ల ప్రేమలేదా? తనేదన్నా లోటు చేశాడా? విశాల ఏమన్నా ప్రతిమ మనసుని గాయపరిచిందా? ఎన్నిసార్లు చెప్పినా విశాల ప్రతిమని క్రమశిక్షణ పేరుతో ఏదో అనకుండా ఉండదు... అలా ఏదన్నా అంటే ప్రతిమ మనసు కష్టపెట్టుకుని.. ఇంక ఈ ఇంటితో నాకేం సంబంధంలెదు అని నిర్ణయించుకుని వెళ్లిపోయిందా? ఎందుకు ప్రతిమ కళ్లలో చిన్న నీటి చుక్క కనిపించలేదు... తనకి దుఖంతో గుండెపగులుతున్నట్టు ఉంది. మగవాడిగా పెకైి ఏడ్చే స్వతంత్రత లేదు కాబట్టి, మౌనంగా వీడ్కోలు చెప్పాడు.. లేకపోతే ఒక్కసారి ప్రతిమని గుండెలకి హత్తుకుని, కణ్వమహర్షి శకుంతలను పంపినట్టుగా పంపాలనిపించింది.. ఆ అవకాశం ప్రతిమ

తనకివ్వలేదు..అందుకే గుండె దిటవు చేసుకున్నాడు.. విశాల కూడా గంభీరంగా ఉంటే ఆశ్చర్యం వేసింది.. విశాల కూడా కఠినాత్మురాలే అనుకున్నాడు.. కానీ, ఇప్పుడు గట్లు తెగిన చెరువులా గుండె తెగి కన్నీటి చెరువైనట్టు ఏడుస్తోన్న విశాలని చూస్తుంటే ఆయనకీ దుఃఖం పొంగుకొస్తోంది...

వాళ్లిద్దరూ అలా బాధపడుతోంటే బలరాం, కల్యాణి నివ్వెరపోయారు... మంజరి కూడా అక్కా, బావలలా ఏడుస్తోంటే నిగ్రహించుకోలేకపోయింది.. ఆ బాధాకరపరిస్థితినుంచి బలరాం, కల్యాణి తెరుకుని నెమ్మదిగా వాళ్లని ఓదార్చి లోపలికి తీసికెళ్లారు...

ఉఉఉఉఉ

పెళ్లికొచ్చిన బంధువులంతా తిరిగి ఊళ్లకి వెళ్లిపోయారు... మంజరి భర్తకి సెలవు లేదంటూ తను కుడా మరునాడే ప్రయాణమైంది.. ఆమె విశాఖపట్నంలో ఉంటుంది... ఆమె భర్తకి షిప్‌యార్డ్‌లో ఉద్యోగం ... మంజరికి పిల్లల్లేరు... విశాలా, మంజరీ, ఇద్దరే ఆడపిల్లలు... మంజరి చిన్నప్పుడే తల్లి పోడంతో విశాల మంజరిని అక్కలా కాక, తల్లిలా కాపాడింది.. ఆ కృతజ్ఞత, ఆ గౌరవం మంజరిలో అడుగడుగునా కనిపిస్తాయి.. అంతేకాదు ఆనంద్ మంచితనం కూడా మంజరి దంపతులని ఆకర్షించడంతో వాళ్లిద్దరంటే ఎనలేని గౌరవాభిమానాలున్నాయి వాళ్లకి... వెళుతూ, వెళుతూ ప్రతిమమీద దిగులు పెట్టుకోవద్దని, జాగ్రత్తగా ఉండమని పదే, పదే అక్కా బావలకి చెప్పింది మంజరి ... బలరాం, కల్యాణిలకు అక్కా, బావలను కనిపెట్టి ఉండమని చెప్పింది... పుష్కలంగా బహుమతులతో చెల్లెలికి వీడ్కోలిచ్చింది విశాల....

విశాల కాలేజీకి లీవుపెట్టి అప్పటికి పదిహేను రోజులు... ఆవేళ గురువారం ... ప్రతిమ అత్తగారింటికి వెళ్లి మూడురోజులు... మూడునిద్రలకి రావాలి ఇవాళ.... ఈ కార్యక్రమం కూడా అయిపోతే సోమావారం నుంచి ఆఫీసుకి వెళ్లచ్చు అనుకుంది.. ఆవేళ ప్రతిమ, శశి రావాల్సిన రోజు... ఆ రోజే వాళ్ల మొదటిరాత్రికి ముహూర్తం పెట్టాడు పురోహితుడు... ప్రతిమగదిని అందంగా అలంకరించారు కల్యాణి, విశాలా కలిసి...సత్యవతికి ఫోన్ చేసింది విశాల....

విశాల స్వరం వింటూనే సత్యవతి ఆదరంగా మాట్లాడింది...“ ఎలా ఉన్నావు విశాలా... పనులు పూర్తయాయా? బాగా అలసిపోయావు.. విశ్రాంతి తీసుకున్నావా?“..

విశాల నవ్వింది... “ బానే ఉన్నాను... ఇంతకీ ప్రతిమెలా ఉంది?“ అనడిగింది..

“ ఏమో నాకేం తెలుసు ఎలా ఉందో....“ నవ్వింది సత్యవతి..

విశాల ఆశ్చర్యంగా అడిగింది..“ అదేంటి? “

“ అదేమరి నా ఇంట్లో ఉంటోన్న ప్రతిమ నాకసలు కనిపించలేదు ఈ మూడురోజుల నుంచి...“

“ ఎక్కడికెళ్లింది?“

సత్యవతి పక, పకా నవ్వింది విశాల స్వరంలో వినిపించిన ఖంగారుకి...“ ఎక్కడికీ వెళ్లలేదోయ్... ఇద్దరూ గది వదిలి బెటైకి రావడంలేదు... ఉదయం కాఫీతో సహా, అన్ని గదిలోకే పంపిస్తున్నాను... మధ్య, మధ్య ఒక్కసారి మెరుపుల్లా కనిపించి వెళుతున్నారు... కొత్తమోజుకదా...“ చిలిపిగా అన్నది.

“ కానీ, అది.... అప్పుడే వాళ్లిద్దరినీ గదిలో.......“ సందేహంగా ఆపింది విశాల

సత్యవతి స్వరంలో చిలిపిదనం పోయింది... కొంచెం అసంతృప్తిగా అన్నది...“ ఆరోజే అప్పగింతలై ఇంటికి వచ్చినరోజే , ప్రతిమ శశి గదిలోకి వెళ్లిపోయింది.... నేను పిలిచేలోగా తలుపేసుకున్నారు... చదువుకున్న పిల్లలు... వాళ్లతో ఈ విషయం ఎలా డిస్కస్ చేయాలో నాకర్థం కాలేదు... అక్కడికీ శశిని పిలిచి చెప్పాను... ఇవాళ, రేపూ ముహూర్తం బాగాలేదుటరా శోభనానికి ...ప్రతిమను నా గదిలో పడుకోమను అని... ఏంటమ్మా నీ చాదస్తం .... పెళ్లి చేశారు... అయిపోయింది... ఇంక మేమెక్కడ పడుకోవాలో, ఎప్పుడు పడుకోవాలో కూడా మహూర్తాలు నిర్ణయించడం ఏంటి? ప్రతిమకిలాంటివి ఇష్టం ఉండదు... అసలు తను హోటల్‌కెడదాం అన్నది ... నేనే వద్దని

ఇంటికి వచ్చాను... లేకపోతే మేము ఏదన్నా స్టార్ హోటల్ బుక్ చేసుకునేవాళ్లం .... నువ్వెళ్లి పడుకో... “ అంటూ నాకు క్లాసు తీసుకున్నాడు...

విశాలస్థాణువైంది....“ కానీ, కానీ సత్యా...“ అంటూ ఆగిపోయింది..

సత్యవతి మృదువుగా అన్నది..“ నాకు తెలుసు విశాలా.. నీకు అన్నీ శాస్త్రప్రకారం జరగాలని... కానీ నేను నిస్సహాయురాలిని..‘

“ఇలా జరగడం నాకు చాలా బాధగా ఉంది సత్యా...“ విశాల కొంచెం బాధగా మరికొంచెం నిష్టూరంగా అంది..

“ బాధపడి ఏం చేయగలం చెప్పు... వాళ్లు మనల్ని మూర్ఖులని, మనం నమ్మేది మూఢాచారం అనీ కొట్టిపారేస్తుంటే ఏం చెస్తాను?“

“ చెప్పాలి.. పెద్దదానివి ఉన్నది దేనికి? మనం కాదు మూర్ఖులం వాళ్లు... వాళ్లకి అర్థమయేలా మనం అనుసరిస్తున్న కొన్ని పద్ధతులని వివరించాలి... సత్యా! మనం ఆచరించే కొన్ని పద్ధతులకి మనమే రీజనింగ్ తెలుసుకుంటే, ఇతరులకి ముఖ్యంగా పిల్లలకి చెప్పగలం .. ఉదాహరణకి బెటైనుంచి వచ్చాక పెరట్లో కాళ్లు కడుక్కుని లోపలికి రమ్మంటారు . ఎందుకో తెలుసా... బెట నానా అశుద్ధాలూ తొక్కివస్తాము ... తద్వారా కాళ్లల్లో చేరుకునే సూక్ష్మక్రిములు ఇంట్లోకి వస్తాయని.. అలాగే భోజనాలు చేసేముందు గచ్చు శుభ్రంగా తుడవాలంటారు... కాళ్లు, చేతులూ శుభ్రంగా కడగాలంటారు... అసలు స్నానం చేయకుండా భోజనం చేయమంటారు దేనికో తెలుసా.... స్నానం చేయడం అనేది కూడా ఓ వ్యాయామం లాంటిది... ఆ వ్యాయామం అయాక ఆకలి బాగా వేస్తుంది.. తిన్నది అరుగుతుందని.. మనం కూడాఏదన్నా తినేటప్పుడు చేతులు కడుక్కుంటాం కదా...

ప్రతి పద్ధతికీ ఓ అర్థం , పరమార్థం ఉంది.. పాతకాలంవాళ్లు పెద్దగా చదువుకోలేదు కాబట్టి వాటిని ఆచారాలు అన్నారు... వాళ్లు ఆచారం అన్నారుకదా అని మనం అదొక దురాచారం అనడం మొదలుపెట్టాం ... ఎందుకంటే వాళ్లకన్నా ఎక్కువ డిగ్రీలున్నాయికాబట్టి, వాళ్లకన్నా మనం మేధావులం అనే అహం .. నిజానికి ఈ రోజుల్లో ఎంత పెద్ద డాక్టరైనా అప్పటివాళ్లతో తూగలేడు... ఈ వాస్తవం అంగీకరించి తీరాలి.. ఇవాళ ప్రతిమను , శశినీ ఇక్కడికి పంపించు... మూడు నిద్రలకి రావాలి.. దాంతో నేను మాట్లాడతాను...“ అన్నది విశాల స్థిరంగా, గంభిరంగా... ‘

విశాల పరిజ్ఞానానికి ముగ్ధురాలైన సత్యవతి.. “ ఆవేశపడకు విశాలా... నెమ్మదిమీద తనే తెలుసుకుంటుంది... అలాగే పంపిస్తాలే.... నువ్వేం బాధపడకు...“ అంది.

ఫోన్ పెట్టేశాక విశాలకి చాలా అస్థిమితంగా, అసహనంగా అనిపించింది. ప్రతిమ మీద విపరీతమైన కోపం వచ్చింది.. ప్రతిమ అనుకుంటున్నట్టు ఇది అభ్యుదయం కాదు... విచ్చలవిడితనం అనిపించింది... తన కూతురలా అసహ్యంగా కక్కుర్తిగా, మగవాడి పొందుకోసం తపిస్తున్నదానిలా ఇలా మెడలో మూడుముళ్లు పడగానే, అలా మొగుడిపక్కలో చేరడం చాలా అసహ్యంగా అనిపించింది... తనెంతొ ఆహ్లాదంగా, మరపురాని మధురమైన జ్ఞాపకంగా మిగల్చాలనుకున్న ఆ అనుభూతిని ప్రతిమ అలా మెకానికల్‌గా అనుభవించడం ఆవిడకి జీర్ణంకానట్టుగా అనిపించింది... ఆ బాధనీ, తన ఏవగింపునీ ఎవరితో పంచుకోలేక మౌనంగా, గంభీరంగా ఉండిపోయింది..

సాయంకాలానికి, ప్రతిమ, శశివచ్చారు...ఎవరి బలవంతం మీదో వచ్చినట్టు, పరాయిచోట తనెన్నడూ ఎరగని పరిసరాల్లో ఉన్నట్టుగా ఇబ్బందిగా తిరిగింది.. ఉదయం నుంచీ కూతురి మీద కోపంతో మండిపడుతోన్న విశాలకి మెడలో పుస్తెలు.. దానికి వేళ్లాడుతోన్న బరువైన సూత్రాలు, నల్లపూసలు, మొహంలో కొత్త కళతో మెరిసిపోతోన్న ప్రతిమను చూడగానే కోపం చేత్తో తీసేసినట్టు పోయింది... పోనీలే తను సంతోషంగా ఉంది.. ఆడపిల్లకి ప్రేమించిన భర్త, పక్కనుంటే ఏంకావాలి అంతకన్నా... అనుకని సంతోషపడింది...వాళ్లెలా గడిపారో

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Pratimadevi**

* * *